10-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - అల్ఫ్ మరియు బే, తండ్రి మరియు వారసత్వము స్మృతిలో ఉన్నట్లయితే సంతోషపు పాదరసము ఎక్కి ఉంటుంది, ఇది చాలా సహజమైన క్షణము యొక్క విషయము"

ప్రశ్న:- అంతులేని సంతోషము ఏ పిల్లలకు ఉంటుంది? సదా సంతోషపు పాదరసము ఎక్కి ఉండాలి అంటే, దానికి సాధనము ఏమిటి?

జవాబు:- ఏ పిల్లలైతే అశరీరులుగా అయ్యే అభ్యాసము చేస్తారో, తండ్రి ఏదైతే వినిపిస్తారో, దానిని మంచి రీతిలో ధారణ చేసి ఇతరుల చేత చేయిస్తారో, వారికే అంతులేని సంతోషము ఉండగలదు. సంతోషపు పాదరసము సదా ఎక్కి ఉండాలంటే దాని కొరకు అవినాశీ జ్ఞాన రత్నాలను దానం చేస్తూ ఉండండి. అనేకుల కళ్యాణమును చేయండి. ఇప్పుడు మేము సుఖము మరియు శాంతి యొక్క శిఖరముల పైకి వెళ్తున్నాము అన్నది సదా స్మృతిలో ఉండాలి, అప్పుడు సంతోషము ఉంటుంది.

ఓంశాంతి. బాప్ దాదా కు కలిగిన ఆలోచన ఏమిటంటే, ఒక్క క్షణములో పిల్లలు చేత వ్రాయించాలి, వారు ఎవరి స్మృతిలో కూర్చున్నారు అని. ఇది వ్రాయడానికి సమయమేమీ పట్టదు. ప్రతి ఒక్కరూ ఒక్క క్షణములో రాసి బాబాకు చూపించాలి. (అందరూ వ్రాసి బాప్ దాదాకు చూపించారు. ఆ తర్వాత బాబా కూడా వ్రాసారు. బాబా ఏదైతే వ్రాసారో అది ఎవ్వరూ వ్రాయలేదు) బాబా అల్ఫ్ మరియు బే అని వ్రాసారు, ఇది ఎంత సహజము. అల్ఫ్ అనగా బాబా, బే అనగా రాజ్యాధికారము. బాబా చదివిస్తారు మరియు మీరు రాజ్యాన్ని పొందుతారు. అంతకన్నా ఎక్కువగా వ్రాయాల్సిన అవసరం లేదు. మీరు వ్రాయడానికి రెండు నిమిషాలు కూడా తీసుకున్నారు. కానీ అల్ఫ్ మరియు బే అనేది క్షణం యొక్క విషయము. సన్యాసులు కేవలం అల్ఫ్ ను తలచుకుంటారు. మీకు రాజ్యాధికారము కూడా గుర్తుంది. స్మృతి చేయడమనేది అలవాటుగా అయిపోతుంది. బుద్ధిలో కూర్చున్నట్లయితే సంతోషపు పాదరసము పైకెక్కి ఉంటుంది. అల్ఫ్ అనగా అర్థము వారు ఎంతో గొప్ప ఉన్నతోన్నతమైన శిఖరము, వారికన్నా ఉన్నతంగా ఇంకే వస్తువూ ఉండదు. వారు ఉండే స్థానము కూడా ఉన్నతోన్నతమైనదే. క్షణములో ముక్తి-జీవన్ముక్తి యొక్క అర్థము గురించి కూడా ఎవ్వరికీ తెలియదు. దానికి కూడా తప్పకుండా అర్థం ఉంటుంది. బిడ్డ జన్మించినప్పుడు ఇన్ని గంటలకు, ఇన్ని నిముషాలకు, ఇన్ని క్షణాలకు పుట్టాడు అని వ్రాస్తారు. టిక్-టిక్ అంటూ సమయం గడుస్తూ ఉంటుంది. ఇలా టిక్ అనగానే అల్ఫ్ మరియు బే, దీనికి ఒక్క క్షణము కూడా పట్టదు. ఇది చెప్పాల్సిన అవసరం కూడా లేదు, స్మృతి ఉండనే ఉంటుంది. పిల్లలైన మీకు ఇంతటి మంచి అవస్థ ఉండాలి. కానీ ఎప్పుడైతే మీరు స్మృతిలో ఉంటారో, అప్పుడే అటువంటి అవస్థ ఉంటుంది. ఇక్కడ కూర్చున్నప్పుడు తండ్రి మరియు రాజ్యము గుర్తుండాలి. బుద్ధి చూస్తుంది, దానిని దివ్య దృష్టి అని అంటారు. ఆత్మ కూడా చూస్తుంది. తండ్రిని ఆత్మయే స్మృతి చేస్తూ ఉంటుంది. మీరు కూడా తండ్రిని స్మృతి చేస్తే రాజ్యము కూడా గుర్తుకొస్తుంది. దానికి ఎంత సమయం పడుతుంది. ఇక్కడ కూడా స్మృతిలో కూర్చున్నప్పుడు ఎంతో పులకరించిపోతారు. బాబా కూడా ఇదే సంతోషములో కూర్చున్నారు. బాబాకు ఇక్కడి విషయాలేవీ గుర్తే లేవు. బాబా అక్కడి విషయాలనే తలచుకుంటారు. బాబా మరియు రాజ్యము ముంగిటలోనే నిలబడి ఉన్నట్లు ఉంది. తండ్రి అంటారు - పిల్లలైన మీ కొరకు రాజ్యాన్ని తీసుకువచ్చాను. మీరు కేవలం స్మృతి చేయడం లేదు, అందుకే సంతోషము నిలవడం లేదు. మీరు లేస్తూ, కూర్చుంటూ స్వయాన్ని ఆత్మగా భావించండి మరియు తండ్రినైన నన్ను మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి. మీరు నివసించే స్థానము ఎంత ఉన్నతమైనది. ఇది ప్రపంచానికి ఏమైనా తెలుసా. మనుష్యులు ముక్తిలోకి వెళ్ళేందుకు ఎంతగా కష్టపడతారు. ఇప్పుడు ముక్తిధామము ఎక్కడ ఉంది? ఆత్మ ఒక రాకెట్ వంటిదని మీరు అర్థం చేసుకున్నారు. వారు చంద్రుని వరకూ వెళ్తారు, ఆ తర్వాత అంతా అంతరిక్షమే. మీరైతే ఆ అంతరిక్షము కన్నా ఎంతో ఉన్నతమైన స్థానానికి వెళ్తారు. చంద్రుడైతే ఈ ప్రపంచానికి చెందినవారు. సూర్య, చంద్రాదులకన్నా దూరముగా, శబ్దానికి అతీతముగా... అని అంటారు. ఈ శరీరాన్ని విడిచిపెట్టాలి. మీరు స్వీట్ సైలెన్స్ హోమ్ (మధురమైన, నిశ్శబ్దమైన ఇంటి) నుండి వస్తారు. రావడానికి-వెళ్ళడానికి సమయము పట్టదు, అది మన ఇల్లు. ఇక్కడైతే ఎక్కడికి వెళ్ళినా సరే సమయం పడుతుంది. ఆత్మ శరీరాన్ని వదిలినప్పుడు ఒక్క క్షణములో ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్ళిపోతుంది. ఒక శరీరాన్ని వదిలి వెళ్ళి ఇంకొకదానిలో ప్రవేశిస్తుంది. కావున స్వయాన్ని ఆత్మగా భావించాలి. మీరు ఎంతో ఉన్నతమైన శిఖరముపైకి వెళ్తారు. మనుష్యులు శాంతిని కోరుకుంటారు. శాంతి యొక్క ఉన్నతోన్నతమైన శిఖరము నిరాకారీ ప్రపంచము మరియు సుఖము యొక్క ఉన్నతోన్నతమైన శిఖరము స్వర్గము. ఉన్నతోన్నతమైన దానిని టవర్ అని అంటారు. మీ ఇల్లు కూడా ఎంత ఉన్నతమైనది. ప్రపంచంలోని వారు ఎప్పుడూ

ఈ విషయాల గురించి ఆలోచించరు. వారికి ఈ విషయాలను అర్థం చేయించేవారు ఎవ్వరూ లేరు. దానిని శాంతి యొక్క శిఖరము అని అంటారు. మనుష్యులైతే విశ్వములో శాంతి ఏర్పడాలని అంటూ ఉంటారు. కానీ దాని అర్థము తెలియదు, శాంతి ఎక్కడ ఉందో తెలియదు. ఈ లక్ష్మీ-నారాయణులు సుఖము యొక్క శిఖరములో ఉన్నారు, అక్కడ ఎటువంటి లోభమూ, అత్యాశ ఉండవు. అక్కడి ఆహార-పానీయాలు, మాటతీరు చాలా రాయల్ గా ఉంటాయి మరియు సుఖము కూడా అతి ఉన్నతంగా ఉంటుంది. వారికి ఎంతటి మహిమ ఉందో చూడండి ఎందుకంటే వారు ఎంతో శ్రమ చేసారు. వీరు ఒక్కరే కాదు, పూర్తి మాల అంతా తయారై ఉంది. వాస్తవానికి తొమ్మిది రత్నాలు మహిమ చేయబడ్డారు. తప్పకుండా వారు గుప్తమైన శ్రమ చేసి ఉంటారు. తండ్రి మరియు వారసత్వము యొక్క స్మృతి ఉండాలి, అప్పుడే వికర్మలు వినాశనమవుతాయి. కానీ మాయ స్మృతి చేయనివ్వదు. కొన్ని సార్లు కామము, కొన్ని సార్లు క్రోధము... ఇవి ఎన్నో తుఫానులలోకి తీసుకువస్తాయి. మీ నాడిని చూసుకోవాలి. నారదునికి కూడా నీ ముఖాన్ని చూసుకో అని చెప్పడం జరిగింది. ఆ అవస్థ ఇప్పుడింకా లేదు, దానిని తయారుచేసుకోవాలి. బాబా లక్ష్యాన్ని-ఉద్దేశ్యాన్ని తప్పకుండా తెలియజేస్తారు. లోలోపల పురుషార్థము చేస్తూ ఉండండి. ముమ్ముందు మీకు ఆ అవస్థ తయారవుతుంది. అశరీరిగా ఉండే అభ్యాసాన్ని చేయాలి. ఇప్పుడు ఇక తిరిగి వెళ్ళాలి. బాబా అన్నారు - నన్ను స్మృతి చేయండి. స్మృతి చేయకపోతే శిక్షలు కూడా ఎంతగానో అనుభవించవలసి ఉంటుంది మరియు పదవి కూడా తగ్గిపోతుంది. ఇవి చాలా సూక్ష్మమైన విషయాలు. వారు సైన్స్ యొక్క లోతుల్లోకి ఎంతగా వెళ్తారు. ఏవేవో తయారుచేస్తూ ఉంటారు. ఆ సంస్కారాలు కూడా కావాలి కదా, ఎందుకంటే వారు మళ్ళీ అక్కడకు వెళ్ళి కూడా ఈ వస్తువులను తయారుచేస్తారు. కేవలం ఈ ప్రపంచము పరివర్తన అవ్వాల్సి ఉంది. ఇక్కడి సంస్కారాల అనుసారంగానే వెళ్ళి జన్మ తీసుకుంటారు. ఏ విధంగానైతే యుద్ధం చేసేవారి బుద్ధిలో యుద్ధపు సంస్కారాలు ఉంటాయి, వారు ఆ సంస్కారాలను తీసుకువెళ్తారు, యుద్ధం చేయకుండా ఉండలేరు. ఆఫీసర్ల వద్ద క్యూ ఉంటుంది. వారిని భర్తీ చేసుకునేటప్పుడు, వీరికి ఏ అనారోగ్యము లేదు కదా, కళ్ళు-చెవులు మొదలైనవన్నీ సరిగ్గా ఉన్నాయా అని పరిశీలిస్తారు. యుద్ధం చేసేటప్పుడు అన్నీ సరిగ్గా ఉండాలి. ఇక్కడ కూడా ఎవరెవరు విజయమాలలోని మణులుగా అవుతారు అనేది చూడడం జరుగుతుంది. మీరు పురుషార్థము చేసి కర్మాతీత అవస్థను పొందాలి. ఆత్మ అశరీరిగా వచ్చింది, అశరీరిగా అయి వెళ్ళాలి. అక్కడ శరీరముతో ఏ సంబంధము ఉండదు. ఇప్పుడు అశరీరిగా అవ్వాలి. ఆత్మలు అక్కడి నుండి వస్తాయి, వచ్చి శరీరములో ప్రవేశిస్తాయి. లెక్కలేనన్ని ఆత్మలు వస్తూ ఉంటాయి. అందరికీ తమ-తమ పాత్ర లభించి ఉంది. కొత్త పవిత్ర ఆత్మలు ఎవరైతే వస్తారో, వారికి తప్పకుండా మొదట సుఖము లభించాలి, కావుననే వారికి మహిమ జరుగుతుంది. ఇది పెద్ద వృక్షము కదా. ఎందరో పేరు-ప్రఖ్యాతల గల గొప్ప వ్యక్తులు ఉన్నారు. వారు తమ-తమ శక్తి అనుసారంగా ఎంతో సుఖములో ఉంటారు. ఇప్పుడు పిల్లలు కృషి చేయాలి, కర్మాతీత అవస్థలోకి పవిత్రముగా అయి వెళ్ళాలి. తమ నడవడికను చూసుకోవాలి - ఎవరికీ దుఃఖాన్ని అయితే ఇవ్వడం లేదు కదా! తండ్రి ఎంత మధురమైనవారు. అతి ప్రియమైనవారు కదా. కావున పిల్లలు కూడా ఆ విధముగా తయారవ్వాలి. తండ్రి ఇక్కడ ఉన్నారని పిల్లలైన మీకు తెలుసు. తండ్రి ఇక్కడ స్థాపన చేస్తున్నారని ఇతర మనుష్యులకు ఏమైనా తెలుసా, కానీ జన్మజన్మాంతరాలూ వారిని తలచుకుంటూ ఉంటారు. శివుని మందిరాలకు వెళ్ళి ఎన్ని పూజలు చేస్తారు. ఎంతో ఉన్నతమైన శిఖరాలపై ఉన్న బద్రీనాథ్ మొదలైన మందిరాలకు వెళ్తారు. ఎన్ని మేళాలు జరుగుతాయి ఎందుకంటే వారు చాలా మధురమైనవారు కదా. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు అని గానం చేస్తారు కూడా. అప్పుడు బుద్ధిలో నిరాకారుడే గుర్తుకొస్తారు. నిరాకారుడైతే ఉండనే ఉన్నారు. ఆ తర్వాత బ్రహ్మ, విష్ణు, శంకరులు. వారిని భగవంతుడు అని అనరు.

మనమే సతోప్రధాన దేవతలుగా ఉండేవారము అని ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. మనం విశ్వాధిపతులుగా ఉన్నప్పుడు ఇంతమంది మనుష్యులు ఉండేవారే కాదు. కేవలం భారత్ లోనే వీరి రాజ్యం ఉంటుంది. మిగిలినవారంతా శాంతిధామానికి వెళ్ళిపోతారు. వీటన్నింటినీ మీరు చూస్తూ ఉంటారు, ఇందులో చాలా విశాల బుద్ధి కావాలి. అక్కడ మీకు పర్వతాలు మొదలైన స్థానాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదు. అక్కడ ఎటువంటి ప్రమాదాలు మొదలైనవి జరగవు. అది ఉన్నదే స్వర్గము అనే అద్భుతము. ఆ స్వర్గము అనే అద్భుతము లేనప్పుడు మాయ యొక్క వింతలు, అద్భుతాలు తయారవుతాయి. ఈ విషయాలను ప్రపంచములోనివారు అర్థం చేసుకోలేరు. ఇప్పుడు మీరు స్వర్గములోకి వెళ్ళేందుకు పురుషార్థం చేస్తున్నారు. అది సుఖము యొక్క శిఖరము, ఇది దుఃఖము యొక్క శిఖరము. యుద్ధాలలో ఎంతమంది మనుష్యులు రోజూ మరణిస్తారు, ఆ తర్వాత జన్మిస్తారు కూడా. ఈశ్వరుని యొక్క అంతాన్ని పొందలేము అని అంటూ ఉంటారు. ఇప్పుడు ఈశ్వరుడైతే ఒక బిందువు, వారి అంతాన్ని ఏం పొందుతారు? తండ్రి అంటారు - ఈ రచన యొక్క ఆదిమధ్యాంతాల గురించి ఎవ్వరికీ తెలియదు. సాధు-సన్యాసులెవ్వరూ రచయిత మరియు రచనల అంతాన్ని పొందలేరు. మిమ్మల్ని తండ్రి చదివిస్తారు, దీనిని చదువు అని అంటారు. సృష్టి చక్రం

యొక్క రహస్యాన్ని గురించి పిల్లలైన మీరే తెలుసుకుంటూ ఉన్నారు. వారైతే మాకు తెలియదు అని అంటారు, లేదా లక్షల సంవత్సరాలు అని అనేస్తారు.

ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు - ఇవి ఏవైతే మీరు ఇక్కడ చూస్తున్నారో, ఇవేవీ అక్కడ ఉండవు. స్వర్గము సుఖము యొక్క శిఖరము. ఇక్కడ దుఃఖమే దుఃఖముంది. అకస్మాత్తుగా మృత్యువు ఎలా వస్తుందంటే ఇక అందరూ అంతమైపోతారు. మృత్యువును చూడడం అంత సులువైన విషయమేమీ కాదు. దీనిని దుఃఖము యొక్క శిఖరము అని అంటారు. అది సుఖము యొక్క శిఖరము. ఇక మూడవ పదమేమీ లేదు. మీలో కూడా వింటున్నా కానీ ధారణ జరగనివారు ఎంతోమంది ఉన్నారు. ఎప్పుడైతే బుద్ధి స్వర్ణిమ యుగానికి చెందినదిగా ఉంటుందో, అప్పుడే ధారణ జరుగుతుంది. ధారణ జరగకపోతే సంతోషము కూడా ఉండదు. అతి ఉన్నతముగా చదువుకునేవారు ఉన్నారు, అలాగే అతి కనిష్టముగా చదువుకునేవారు కూడా ఉన్నారు. చదువులో తేడా అయితే ఉంది కదా. వారికి అనంతమైన తండ్రి ఎంతగా అర్థం చేయించినా కానీ వారు ఎప్పటికీ అర్థం చేసుకోరు. స్మృతి లేకుండానైతే మీరు ఎప్పటికీ పవిత్రముగా అవ్వలేరు. తండ్రియే అయస్కాంతం వంటివారు, వారు పూర్తిగా ఉన్నతోన్నతమైన శక్తి కలవారు. వారిపై ఎప్పుడూ తుప్పు పేరుకోదు, మిగిలినవారందరిపై తుప్పు పేరుకొని ఉంది, దానిని తొలగించి మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. తండ్రి అంటారు - నన్నొక్కరినే స్మృతి చేయండి, ఇంకెవ్వరిపైనా మమకారము పెట్టుకోకూడదు. షావుకారులకైతే రోజంతా ధన-సంపదలే ఎదురుగా వస్తూ ఉంటాయి. పేదవారి వద్దనైతే ఏమీ లేదు కానీ పేదవారు కూడా వివేకవంతులుగా ఉండాలి, అప్పుడే ధారణ చేయగలుగుతారు. స్మృతి లేకుండా చెత్త ఎలా తొలగుతుంది, మనం పవిత్రముగా ఎలా అవుతాము. మీరు ఉన్నతమైన శిఖరముపైకి వెళ్ళేందుకే ఇక్కడకు వచ్చారు. తండ్రి ఇచ్చే శిక్షణపై నడవడం ద్వారా మనం ఉన్నతమైన సుఖము యొక్క శిఖరము పైకి వెళ్తామని మీకు తెలుసు. ఇందులో శ్రమ ఉంది. తండ్రి వచ్చేదే శిఖరముపైకి తీసుకువెళ్ళేందుకు. కావున శ్రీమతముపై నడవాల్సి ఉంటుంది. మొదటి నెంబరులో ఈ లక్ష్మీ-నారాయణుల గాయనమే ఉంది. వారు పూర్తిగా ఆ ఉన్నతమైన శిఖరములో ఉంటారు. ఆ తర్వాత వచ్చేవారు కొద్దిగా తక్కువగా ఉంటారు. కొత్త ప్రపంచాన్నే సుఖము యొక్క శిఖరము అని అంటారు. అక్కడ ఏ విధమైన మురికి వస్తువు ఉండదు. ఇళ్ళను పాడు చేసే విధంగా ఇటువంటి మట్టి, ఇటువంటి గాలులు అక్కడ ఉండవు. స్వర్గానికైతే ఎంతో మహిమ ఉంది, దాని కొరకే పురుషార్థము చేయాలి. లక్ష్మీ-నారాయణులు ఎంత ఉన్నతమైనవారు, వారిని చూడడంతోనే హృదయం సంతోషపడుతుంది. ముందుముందు అనేకులకు సాక్షాత్కారాలు జరుగుతూ ఉంటాయి. ప్రారంభములో ఎన్ని సాక్షాత్కారాలు జరిగేవి. ఎంతగా బాబా అక్కడి సౌందర్యాన్ని చూపించారు. కిరీటము మొదలైనవి ధరించి వచ్చేవారు. ఆ వస్తువులేవీ ఇక్కడ లభించవు. బాబా అయితే వజ్రాల వ్యాపారి. ఇంతకుముందు ఏ మణినైతే 50 వేలకు తీసుకునేవారో, అది ఇప్పుడు 50 లక్షలకు కూడా లభించడం లేదు. మీరు స్వర్గము కొరకు పురుషార్థము చేస్తున్నారు. అక్కడ అపారమైన సుఖము ఉంది. తండ్రి ఎంతగానో చదివిస్తారు, అయినా కానీ పిల్లలలో రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంటుంది. రాజా-రాణులు ఎక్కడ, దాస-దాసీలు ఎక్కడ. ఎవరైతే మంచి రీతిలో చదువుకుంటారో మరియు చదివిస్తారో, వారు దాగి ఉండలేరు. వారు వెంటనే - బాబా, మేము ఫలానా స్థానానికి వెళ్ళి సేవ చేస్తాము అని అంటారు. సేవ అయితే ఎంతగానో ఉంది. మీరు ఈ అడవిని మందిరముగా తయారుచేయాలి. రొట్టెముక్కను తిన్నా తినకపోయినా సేవ కోసమై పరుగుతీయండి. వ్యాపారం చేసేవారు ఇలాగే చేస్తారు. మంచి కస్టమరు వస్తే తిన్నా తినకపోయినా పరుగెడతారు, ధనాన్ని సంపాదించాలన్న అభిరుచి ఉంటుంది. ఇక్కడైతే అనంతమైన తండ్రి నుండి అపారమైన ధనం లభిస్తుంది. ఇంకా కొద్ది సమయం ఉన్నా కానీ రేపే శరీరాన్ని విడిచిపెట్టవచ్చు, ఎలాంటి భరోసా లేదు. వినాశనమైతే జరిగేదే ఉంది. మీ కొరకు అయితే అది - వేటగానికి వేట మరియు వేటకు మృత్యువు అన్నట్లు ఉంటుంది. మీ సంతోషానికి అవధులు లేవు. మీకు అంతులేని సంతోషము ఉండాలి. మీరు అనేకుల కళ్యాణము చేయాలి. చివరిలో కర్మాతీత అవస్థ ఏర్పడనున్నది. మీరు స్మృతి చేస్తూ-చేస్తూ అశరీరులుగా అయిపోతారు, అప్పుడు ఎటువంటి కష్టము లేకుండానే ఎగిరిపోతారు. ఇది చాలా శ్రమతో కూడుకున్నది. కొందరు చాలా సేవ చేస్తారు. రోజంతా మ్యూజియంలో అర్థం చేయించేందుకు నిలబడి ఉంటారు. రాత్రి-పగలు సేవలో తత్పరులై ఉంటారు. వందలాది మ్యూజియంలు తెరుచుకుంటాయి. లక్షలాది మంది మీ వద్దకు వస్తారు, మీకు తీరిక దొరకదు. అన్నింటికన్నా ఎక్కువగా మీ దుకాణాలే వెలువడతాయి, అవే ఈ అవినాశీ జ్ఞాన రత్నాల దుకాణాలు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జ్ఞానాన్ని ధారణ చేయడానికి మొదట మీ బుద్ధిని స్వర్ణిమ యుగానికి చెందినదిగా తయారుచేసుకోండి. తండ్రి స్మృతి తప్ప ఇంక దేనిపైనా మమకారము ఉండకూడదు.

2. కర్మాతీత అవస్థను పొంది ఇంటికి వెళ్ళేందుకు అశరీరులుగా అయ్యే అభ్యాసము చేయండి. మీ నడవడికను చూసుకోండి - ఎవరికీ దుఃఖమైతే ఇవ్వడం లేదు కదా, తండ్రి సమానంగా మధురంగా అయ్యానా.

వరదానము:- సహన శక్తి యొక్క ధారణ ద్వారా సత్యతను అలవరచుకునే సదా విజయీ భవ

ప్రపంచములోనివారు ఏమంటారంటే - ఈ రోజుల్లో సత్యమైనవారు నడవటం కష్టము, అబద్ధాలు చెప్పాల్సే ఉంటుంది. కొంతమంది బ్రాహ్మణ ఆత్మలు కూడా - అక్కడక్కడా చతురతతో నడవాల్సే వస్తుంది అని భావిస్తారు. కానీ బ్రహ్మాబాబాను చూసారు, సత్యత మరియు పవిత్రత కొరకు ఎంత అపోజిషన్ జరిగింది, అయినా గాభరా పడలేదు. సత్యత కొరకు సహనశక్తి అవసరము ఉంటుంది. సహనము చెయ్యవలసి ఉంటుంది, ఒంగవలసి ఉంటుంది, ఓటమిని స్వీకరించాల్సి ఉంటుంది, కానీ అది ఓటమి కాదు, అది సదాకాలిక విజయము.

స్లోగన్:- ప్రసన్నంగా ఉండటము మరియు ప్రసన్నం చెయ్యటము - ఇదే ఆశీర్వాదాలను ఇవ్వటము మరియు ఆశీర్వాదాలను తీసుకోవటము.

అవ్యక్తి సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

నా వారు అయితే ఒక్క బాబాయే మరియు నా సర్వస్వమూ ఈ ఒక్క నా అన్నవారిలోనే ఇమిడిపోవాలి. ఎక్కడ కావాలంటే అక్కడ, ఎలా కావాలంటే అలా, ఎంత సమయము కావాలంటే అంత సమయము మనసు ఏకాగ్రమవ్వాలి, దీనినే మనసు వశములో ఉంది అని అంటారు. ఈ ఏకాగ్రత ద్వారా అనగా ఏకరస స్వీట్ సైలెన్స్ స్థితి ద్వారా సహజంగానే డబుల్ లైట్ ఫరిశ్తా స్వరూపము యొక్క అనుభూతి కలుగుతుంది.